ఆప్యాయంగా
అల్లుకుపోయే భార్యను
దూరంచేసిన
అతనికి వచ్చిన
జబ్బు ఏమిటి?

# గురజాడ శోభాపేరిందేవి కథ

ఈ రోగులకు
మందివ్వు
భగవాన్

భర్తకోసం చాలా సేపట్నుంచీ ఎదురుచూస్తున్న ఆమె అతను గేటును సమీపించగానే పరుగున గుమ్మందిగి "ఇంతాలస్యమైందేం?" అనడిగింది.

అతను జవాబివ్వలేదు.

ఆమెని దాటుకుని లోపలికొచ్చి ఉసూరుమని కుర్చీలో కూలబడ్డాడు.

"అలా ఉన్నావేం ఇంకా నీర్సంగానే వుందా?"

"ప్లీజ్! నన్ను కాస్సేపు ఒంటరిగా వదిలేసెయ్యి."

"కాస్సేపేమిటి రాత్రంతా అలాగే కూర్చో. కాఫీ భోంచేసి కూర్చో. ఇప్పటికే బాగా రాత్రయింది."

"నాకకలి లేదు."

"ఈ మధ్య చాలా తరచు అదేమాటంటున్నావు. ఏమైంది నీకు?" అతని జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి నిమురుతూ అడిగిందామె.

ఇంక భరించలేకపోయాడతను.

గభాల్న ఆమె గుండెల్లో ముఖం దాచేసుకున్నాడు. అతని కన్నీళ్ళు ఆమెని వెచ్చవెచ్చగా స్పర్శిస్తున్నాయి. ఆమె స్పర్శలో సేదదీర్తున్నట్లుగా అలాగే ఉండిపోయాడు.

"నీ కష్టం, సుఖం నావి! నీకోసం నా ప్రాణమైనా ఇస్తాను."

"నాకు తెలుసు. నాకు తెలుసు" గొణిగాడు.

"మరి చెప్పవేం?"

"ఎలా చెప్పాలా అని?"

"ఇలాగే" అంది అతని తలనిమురుతూ?

**ACQUIRED COMMONE DEFICIENCY**



**SYNDROME** అన్నాడతను అతినెమ్మదిగా.

''అంటే...?''

''ఎయిడ్స్!'' మాట కూడదీసుకుంటు న్నట్లుగా చెప్పాడు.

అతన్ని ముట్టిన తన చేతుల్ని చటాల్న వెనక్కి లాగేసుకుంది. గబుక్కున అతనికి దూరం జరిగింది.

భర్తని భూతాన్ని చూసినట్లు

మాడసాగింది. భార్య అంత సడన్‌గా దూరంగా జరగడంతో ముందుకు తూలిపడబోయిన అతను కుర్చీచెయ్యి పట్టుకుని ఆపుకున్నాడు.

కాని అతని తలకి మాత్రం కుర్చీ విసురుగా కొట్టుకోడం జరిగిపోయింది.

అది అతను తిన్న మొదటి దెబ్బ!

తలను దిమ్మెత్తించిన ఆ దెబ్బవల్ల నిముషం సేపు ఏం మాట్లాడలేక మౌనంగా కూర్చుండిపోయాడు.

కాని ఆ నిముషంలోనే ఆమె మనసుని లెక్కలేనన్ని ఆలోచనలు మథించసాగాయి.

ప్రపంచం మొత్తం మీద 26000 మందిదాకా ఎయిడ్స్ రోగులున్నారని ఎక్కడో చదివిన విషయం గుర్తొచ్చింది. ఈ పాటికి వారి సంఖ్య ఇంకా పెరిగిపోయి ఉంటుంది.

సడన్‌గా భర్త బరువు బాగా తగ్గిపోవడం, వైరల్ ఫీవర్, దగ్గురావడం, ఆకలి మందగించడం గుర్తొచ్చాయి.

''ఏయ్'' పిల్చాడతను.

ఆమె ఇంకా ఈ లోకంలోకి రాలేదు.

''ఏయ్ ఏమిటలా ఉండిపోయావ్?'' భార్య భుజాలు పట్టుకుని ఊపుతూ అన్నాడు.

ఆమె తృళ్ళిపడింది.

''భయం లేదు. భగవంతుడిచ్చినంత కాలం ఆయువుంటుంది'' నిర్లిప్తంగానూ, ఆమెకి ధయిర్యం చెప్తూనూ అన్నాడు.

ఆమేం విన్లేదు.

చరచరా వెనక్కెళ్ళిపోయింది.

వెళ్తూవెళ్తూ అంది.

''పొయ్యి మీద కూరమాడ్తున్నట్టుంది చూసివస్తాను.

నిజానికి కూర చేసేసి చాలాసేపే అయింది. అసలామె వంట పూర్తిచేసే కూర్చుందని అందుకే తను రాగానే భోజనానికి పిలిచి ఉంటుందని అతనాలోచించడం లేదు.

ఆలోచనా రహితంగా ఉందతని స్థితి!

లోపలికెళ్ళినామె స్టవ్ దగ్గర నిలబడిపోయింది.

ఆమె గుండె మండిపోతోంది.

ఎవరికొస్తుంది ఎయిడ్స్?

స్వజాతి సంపర్కం కలవారికి, వేశ్యాలోలత్వంగల వారికి, అని కదూ తను విన్నది!

కనక ఈ రెండింటిలో ఏదో ఒకటి చేసి ఉంటాడతను.

అయినా ఓ భార్యగా తనకేం తక్కువని? బంగారంలాంటి భార్యని ఉంచుకుని కూడా అలా చేసిన అతన్ని తనే మాత్రం క్షమించలేదు.

ఆమె ఆలోచనలు అర నిముషంలోనే చాలా దూరం దాకా వెళ్ళిపోయాయి.

మనసులోని ప్రేమ పరుగున పోయింది.

కసి చేరింది.

ద్వేషం దరిచేరి చతికిలబడింది.

లోపలిగది ఉయ్యాల్లోని పాపాయి క్యారుమంది. ఆమెకి లేవాలని లేదు. ఆ మాటకొస్తే అసలేం చెయ్యాలని లేదు. చలనరహితంగా అయిపోయింది.

పాపాయి గొంతు పెంచింది.

అయినా ఆమె లేవలేదు.

కాని క్షణం పోయాక పాప ఏడుపు టక్కున ఆగింది. దానికి కారణం అర్థమైనట్లుగా స్ప్రింగ్‌లాగ లేచి ముందుగదిలోకి పరుగెట్టింది.

ఆమె ఊహించినట్టే భర్త ఆ పసికందుని గుండెకి హత్తుకుని పచార్లు చేస్తున్నాడు. కూతురి కోసం శక్తిని కూడదీసుకున్నాడో ఏమో!

"ఏయ్ పాపనిటు ఇవ్వు!" అరుస్తూ పాపాయిని లాగేసుకుంది.

ఏమీ ఎరగనట్లు అమాయకంగా చూస్తున్న అతని ముఖం ఆమె ఆగ్రహాన్ని అధికతరం చేసింది.

అందుకే అరిచినట్లుగా అంది.

"నువ్వు పాపని కానీ బాబుని కానీ ముట్టుకోడానికి వీల్లేదు. మతిమాలిన పనులుచేసింది కాక..."

ఆమె వైపు అయోమయంగా చూస్తూ అన్నాడు. ఆమెని మధ్యలోనే ఆపి—

"నేనేం చేసాను మతిమాలి...!" అని

"నువ్వేం చెయ్యలేదయ్యా! నేనే చేసాను, ఇలాంటి వాడితో ఇన్నేళ్లూ కాపురం" అంది అక్కడ్నుండి వెళ్తూ!

* * *

"అదేంటే నాకు వరండాలో అన్నం పెడ్తున్నావు? అదీ ఈ ఆకులో?"


"అవును నేను కాబట్టి ఇంతటితో ఆపాను. నీకొచ్చిన రోగమే నాకొచ్చుంటే నన్ను ఇంట్లోంచే వెళ్ళగొట్టేవాడివి."

నివ్వెరపోయి చూడసాగాడతను.

ఆమె చెప్పుకుపోయింది.

"నర్సులూ, డాక్టర్లు కూడా ట్రీట్ చెయ్యడానికి అంగీకరించని నికృష్టమైన జబ్బు ఇది!"

"నీదింత రాతి గుండెని నేననుకోలేదు." నెమ్మదిగా అన్నాడు.



నా నుండి ఇంత రాక్షసంగా మారడానికి కారణం ఏ జబ్బు! ఏ జబ్బొచ్చిన తీరు! నువ్వే క్యాన్సర్ పేషంట్‌వో అయితే నా పిల్లల్ని అనాథాశ్రమంలో చేర్పి అయినా నీకు సేవ చేసేదాన్ని! ఈ రోగమంటే నాకు అసహ్యం! ఈ రోగులంటే మరీ ద్వేషం! ఒళ్ళు కొవ్వెక్కి చేసే చెడ్డ ఫలితమే ఈ జబ్బు!

అతను అన్నం తినలేదు.

లేచి వెళ్ళిపోయాడు. ఆమె కూడా పట్టించుకోకుండా తన పనిలో నిమగ్నమైంది.

* * *

అతని ఆరోగ్యం నానాటికీ దిగజారసాగింది. మందులేవీ వాడడం మానేశాడు.

మౌనంగా ఉంటున్నాడు. అసలు ఇంట్లో ఎక్కువ భాగం ఉండడమే మానేశాడు.

చుట్టాలూ, పక్కింటిదాకా విషయం ఎలా వెళ్ళిపోయిందో కానీ అంతా అతన్ని పురుగులాగ చూడసాగారు. అతనికి తమ ముఖం కనబడితే ఎక్కడ పలకరిస్తాడో అన్నట్లుగా తప్పుకుపోసాగారు.

అతనికి ఆకలి కావడంలేదు.

అసలేమాత్రం నిద్ర రావడంలేదు. మనసులోని అశాంతి అసలే అంతర్ధానం కావడంలేదు.

* * *

తెల్లారింది. పిల్లలు లేచారు.

ఆమె లేచి పనులు చేసుకోసాగింది.

కాని అతనింకా కళ్ళే విప్పలేదు.

ఆమె ఎన్నోసార్లు చూసింది ఏదో పనిమీద దొడ్లోవైపుకు వచ్చినప్పుడు!

కాని లేచే ప్రయత్నం చెయ్యలేదు. ఇంకా లేవలేదేంటో ఆమెకైనా అనుకోలేదు.

ఎనిమిది పదిని చేసి పరపరాపోగ పన్నెండైంది.

సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.

ఇంకా అతను అలాగే పడుండడం అదీ ఒకే భంగిమలో ఉండడం ఆమెని అనుమానపరచింది. ఆలోచింపచేసింది.

అతన్ని కుదిపింది.

అతని శరీరం నిర్జీవంగా ఆమె కుదిపిన వైపుకు వాలిపోయింది.

ఆమె అరుపులకి ఇరుగూ పొరుగూ రావడం, పోలీసులూ, డాక్టర్లూ, హాస్పిటల్‌పోస్ట్‌మార్టమ్ సందడులు అన్నీ గబగబా యాంత్రికంగా జరిగిపోయాయి.

తర్వాతే ముంది?

సానుభూతి చూపేవారి సంఖ్య తగ్గిపోయింది. అంతా అతన్ని ఇంచుమించుగా మర్చిపోయారు.

కాని ఆమె మాత్రం పూచికపుల్లలాగ అయిపోయింది. చైతన్యమే తను అన్నట్లుండే ఆమె నిర్లిప్తంగా ఉంటోంది.

అతను ఆఖరుగా రాసిన ఉత్తరంలోని ప్రతివాక్యం పదేపదే గుర్తొచ్చి పరపరా ఆమె హృదయాన్ని కోసేయసాగింది.

రోజూలాగే అలవాటుగా ఒణుకుతున్న చేతులతో ఉత్తరాన్నందుకుని చదువుకోసాగిందామె!

సంబోధనలేదా ఉత్తరానికి!

కాని సాంతం చదివితే ప్రతి వ్యక్తినీ పలకరిస్తున్నట్లూ, పేర్తే

చూస్తున్నట్లూ, వెక్కిరిస్తున్నట్లూ ఉంది.

నేను రోగిని! మామూలు రోగిని కాను ఎయిడ్స్ రోగిని! అందర్నీ భయభ్రాంతులకు, అసహ్యానికి గురి చేసే వ్యాధిగ్రస్తుడ్ని!

అసలు నాకా వ్యాధి ఎందుకొచ్చింది?

నాకు ఏ వేశ్యతోనూ సంపర్కంలేదు.

స్వజాతి సంపర్కం లేదు.

అయినా నన్నే వెతుక్కుంటూ వచ్చింది ఎయిడ్స్!!

అందరూ నన్ను పురుగులా చూసేలాగా చేసింది. పరిహసించేలాగా చేసింది.

అసలే రోగంతో బాధపడుతున్న నేను నా తోటి మానవుల మాటలు తూటాలు తగిలి గిలగిల్లాడిపోయాను. గుండెలు బాదుకుని ఏడ్చాను. అవును మరి నేను అనుభవిస్తూ వచ్చినది చేయని నేరానికి శిక్ష!

ఇంతకీ నాకు ఎయిడ్స్ రావడానికి కారణం డాక్టర్ స్టెరిలైజ్ చేయని సూదితో ఇంజక్షన్ ఇవ్వడమే! ఓ ఎయిడ్స్ రోగికి ఇంజెక్ట్ చేసిన సూదితో మరో రోగికి ఇంజెక్ట్ చేసిన ఆ డాక్టర్ పేరు బయటపెట్టి అతన్ని శిక్షించాలని నాకు లేదు.

నన్ను నిలువునా పిండేస్తూ, పీల్చేస్తూ నన్ను వెలివేసిన మిగతా అందరికీ కూడా ఆ లెక్కన మాత్రం శిక్షణమయిందో!

అసలీ సమాజాన్నే వెలివేయాలి. వెలివేస్తున్న వ్యక్తిని ఓదార్చకపోగా అసలతని విషయం వినకపోగా రాళ్ళు విసుర్తూ మాత్రం ఉండిపోవడం ఎంత అమానుషం!

అసలు అసలు నాకు కాదురోగం వచ్చింది! ఈ మనుష్యులకే ఉంది అదోరకమైన మానసిక రోగం! నా రోగానికే కాదు మందుకనిపెట్టనిది ఆ రోగానికెక్కడా ఏ మందూ కనిపెట్టలేదు. నా రోగానికి మందు మానవులు నేడో రేపో కనిపెడ్తారు. కానీ ఆ రోగుల రోగాలకి మందు కనిపెట్టగలిగింది కేవలం ఒక్క భగవంతుడే!

నాకు ఇప్పుడు చాలా హాయిగా ఉంది.

నేనీ రోగుల రోగం నా దాకా ప్రబలని మరో లోకానికి మరలిపోతున్నాను.

నా ఆఖరు విన్నపం ఒక్కటే!

ఈ రోగులకు మందివ్వు భగవాన్.

తక్షణం మందివ్వు! లేకపోతే దయా, జాలి, మమతా, మానవతా మరింత తరిగిపోయి దానవులైపోయి ఇంకెన్ని దారుణాలు చేస్తారో! ఈ యుగాన్నే ఎంతెంత దారుణంగా అంతమొందిస్తారో!

❀

సినిమా



"రాత్రి సినిమా కెళ్ళాను.. అబ్బ సినిమా చూస్తుంటే ఎంత భయమేసిందో" చెప్పాడు శీనారావు.

"అబ్బ... అంత భయంకరమైన సినిమావా అది" అడిగాడు ఆత్మారావ్.

"భయంకరమా... బొందా హాల్లో నేనొక్కడినే... అందుకే భయమేసింది" చెప్పాడు శీనారావు.

—వై.రాజశేఖర్ (విజయనగరం)